ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 7 మే 2025



రహదారుల నిర్మాణంతో అభివృద్ధి



శివపల్లి-నర్సయ్యపల్లి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో లింక్ రోడ్లను తారురోడ్లుగా నిర్మించుకుంటే రవాణా సౌలభ్యం మెరుగుపడి ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం శివపల్లి నుంచి నర్సయ్యపల్లి(ఎస్సీకాలనీ)వరకు తారురోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ ద్వారా మంజూరైన రూ.2కోట్ల 45లక్షల నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మిగిలి ఉన్న గొలుసు రోడ్లను గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రెండోదశలో శివపల్లి నుంచి సుల్తాన్‌పూర్ వరకున్న రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎలాంటి కటింగులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరుగుతున్నాయని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు పాలేపు పూర్ణసుధాకర్‌రావు, అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, తిరుపతిగౌడ్, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, చింతకుంట గోపి, తాటిపల్లి రమేష్‌బాబు, దుగ్యాల గోపాల్‌రావు, పాల్గొన్నారు.

యూడీఐడీ నంబర్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కాళిందిని

పెద్దపల్లిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ దివ్యాంగుడికి యూడీఐడీ నంబర్‌పై అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్నకుమారి, జడ్పీ సీఈఓ నరేందర్‌లతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ అక్టోబర్ 31, 2023 నాటికి జారీ చేసిన సదరం సర్టిఫికెట్లకు యుడీఐడీ నంబర్ జనరేట్ చేసి దివ్యాంగులకు పంపిణీ చేశామన్నారు. ఎవరికైనా లేనిపక్షంలో ఆధార్ లేదా మొబైల్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఐడీ కార్డు లేని దివ్యాంగులు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదిస్తే జనరేట్ చేస్తారని తెలిపారు. నూతనంగా యుడీఐడీ కార్డుల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత ఐడీ కార్డు జనరేట్ చేయాలని సూచించారు. కార్డుల జారీ, వాటి వినియోగంపై దివ్యాంగులకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఎంపీడీవోలు, భవిత సెంటర్ నిర్వాహకులు, దివ్యాంగులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సుల్తానాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని దేవి నిర్వాహకులను, ఏపీఎంలను ఆదేశించారు. మంగళవారం గర్రెపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఏ రోజు ఎంత మేరకు కొనుగోళ్ళు జరుగుతున్నాయో, మిల్లులకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని తరలించారు. ఇంకా సెంటర్‌లో ఏ మేరకు దాన్యం నిలువ ఉందన్న వివరాలను తెలుసుకున్నారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతు ఐకేపీ సెంటర్‌లో మహిళలే నిర్వహించడం అభినందనీయమన్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కొనుగోళ్లు వేగవంతం చేయించాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం గీత మహిళ సమైఖ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమతు కారణంగా బుధవారం ఉదయం ఏడున్నర నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్ఈ మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, కూనారం క్రాస్ రోడ్, భూమ్‌నగర్, శివపురి కాలనీ, టీచర్స్ కాలనీ, వాసవినగర్, శ్రీనివాస థియేటర్, అగ్రికల్చర్ మార్కెట్ ఏరియాలో సరఫరా ఉండదన్నారు. పెద్దపల్లి (గుండమ్మకట్ట) 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో అయ్యప్ప టెంపుల్‌ఏరియా, క్రిస్టియన్ కాలనీ, చంద్రకాకనగర్, కొంతంవాడ, ప్రగతి నగర్‌లలో సరఫరా నిలిచి పోతుందన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్ల పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): చందపల్లిలోని డబల్ బెడ్ రూంల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ అధికారులకు సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ రాంపల్లి, చందపల్లిలో డబుల్ బెడ్‌రూంల వద్ద పనులు పూర్తి దశకు చేరుకున్నాయని, వాటర్ ట్యాంక్, విద్యుత్ లైన్లు, రోడ్డు పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. త్వరలో లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఏఈ సతీష్, వర్క్‌ఇన్స్పెక్టర్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

- కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక జాబితా
- అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- ముహూర్తాలు దాటిపోతున్నాయని ఆందోళన
- మంత్రి, ఎమ్మెల్యేలు ఇళ్ల మంజూరుకు చొరవచూపాలి



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగు తున్నది. పథకాన్ని ఆరంభించి మూడు మాసాలు గడు స్తున్నా లబ్ధిదారుల ఎంపిక ఇంకా కొలి క్కి రాలేదు. దీంతో ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారా అని అర్హులైన వారు ఎదురు చూస్తున్నారు. మండలానికి ఒక గ్రామంలో ఇళ్లు మంజూరు చేసింది కానీ మిగతా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల మంజూరు చేయకపోవడంతో అనేక మంది అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసేందుకు మంచి ముహూ ర్తాలు పోతున్నాయని అర్హులు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూముల ఇళ్ల పథకాన్ని తీసుక రాగా, అది ఆశించిన మేరకు ముందుకు సాగ లేదు. దీంతో అనేక మంది పేదల సొంతింటి కల నెరవేరలేదు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఇంది రమ్మ ఇళ్ల పథకాన్ని తీసుక వస్తామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ఉచితంగా 5 లక్షల రూపాయలు అంద జేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించింది. ఈ ఇళ్లను సొంత ఇంటి స్థలం ఉన్న వారికే మంజూరు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1,85,404 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను, ప్రత్యేకించి ఇందిరమ్మ యాప్‌ను రూపొందించింది. గత ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఫొటోలు తీసి, వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆరంభించింది. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆయా పథకాలకు ఎంత మంది అర్హులు ఉన్నారో వారందరికీ ఆ పథకాలను వర్తింపజేసింది.

ఎంపిక చేసిన గ్రామాలకు 1957 ఇళ్లు మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూరల్ మండలాల్లో 13 గ్రామాలను ఎంపిక చేశారు. ఎలిగేడు మండలం శివపల్లికి 108 ఇళ్లు, జూలపల్లి మండలం కోనరావు పేటకు 144, ఓదెల మండలం శానగొండకు 217 ఇళ్లు, పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి 153, కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లి 114, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి 167, అంతర్గాం మండలం మద్దిర్యాలకు 59, పాలకుర్తి మండలం రామారావుపల్లికి 124, మంథని మండలం అడవి సోమన్‌పల్లికి 228, ముత్తా రం మండలం మచ్చుపేటకు 40, కమాన్‌పూర్ మండ లం రొంపికుంటకు 208, రామగిరి మండలం రత్నాపూర్ 323 ఇళ్లు, ధర్మారం మండలం బంజేరుపల్లికి 72 ఇళ్లు, మొత్తం 1957 ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 702 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోయగా, 219 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. ఇంకా 1238 ఇళ్లకు ముగ్గులు పోయాల్సి ఉంది. ఈ నిర్మాణాలు కూడా ముందుకు సాగడం లేదు.

- మిగతా గ్రామాలు, పట్టణాల్లో ఎంపికలో జాప్యం

జిల్లాలో ఎంపిక చేసిన 13 గ్రామాలు మినహా

(మిగతా 8వ పేజీలో)

జాతీయ రహదారి పనులు

వేగవంతం చేయాలి



నేషనల్ హైవే పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని/మంథనిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్-మంచిర్యాల జాతీయ రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని వెంపాడులో జరుగుతున్న జాతీయ రహదారి పనులు, పుట్టపాక, స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మంథని పట్టణంలోని పాత పాల కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు పనులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. యాసంగి పంట సీజన్‌లో రైతులు పండించిన నాణ్యమైన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తేమ ప్రమాణాలు రాగానే కొనుగోలు చేస్తున్నామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించేలా ఏర్పాటు చేశామన్నారు. మంథని పట్టణ ప్రాంతంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ సెంటర్ 3 రోజులలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని, రామగిరి తహసీల్దార్లు కుమారస్వామి, సుమన్, ఏడిఎం అంజని, అశోక్, పద్మ, మౌనిక, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివారంపేట్ గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆదివారంపేట్ గ్రామంలో నిర్వహించే రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుమన్, ఏడిఎం అంజని, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సుల్తానాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని తద్వారా నేరాలు తగ్గుముఖం పడతాయని పెద్దపల్లి జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ స్వప్నరాణి అన్నారు. చిన్నకలువల పంచాయతీ ఆవరణలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతు ప్రజలకు ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు, చట్టాల గురించి అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు సైబర్ మోసాలకు గురి అవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అధికారులను సంప్రదిస్తూ, పోలీస్ అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రమాదాలు జరిగితే తల్లి దండ్రులపై కేసులతోపాటు వాహనాలు జప్తు చేస్తారన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బాలికా సాధికారతకు ఎన్‌టీపీసీ కృషి



శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఈడీ చందన్‌కుమార్

జ్యోతినగర్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ బాలికా సాధికారతకు కృషి చేస్తున్నదని రామగుండం, తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టుల ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మంగళవారం ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలిక సాధికారత మిషన్ (జెమ్) వర్క్‌షాప్‌ను ఈడీ ప్రారంభించారు. ఎన్‌టీపీసీ పీటీఎస్‌లోని కాకతీయ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఈడీ మాట్లాడారు. ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తితో పాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. బాలికల సాధికారత, వారి అభ్యున్నతికి ఎన్‌టీపీసీ ప్రయత్నిస్తోందన్నారు. బాలికలను మరింతగా ప్రోత్సహించేందుకు ఆరు సంవత్సరాలుగా గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ పేరిట 8వ తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అమ్మాయిలలో డ్రాప్ అవుట్లను తగ్గించటం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌లు కొనసాగిస్తున్నామన్నారు. అమ్మాయిలకు అవకాశ మిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందుతున్న బాలి కలకు బ్యాగులు ఇతర వస్తువులను ఈడీ పంపిణీ చేశారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత, ఎన్‌టీపీసీ అధికారులు, పాల్గొన్నారు.

బాలికా సాధికారత వర్క్‌షాప్ ప్రారంభం

ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. 28 రోజుల పాటు ఎన్‌టీపీసీ చుట్టుపక్కల నాలుగు మండలాలకు చెందిన 120 మంది 8వ తరగతి బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వర్క్ షాప్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లతో పాటు మ్యాథమెటిక్స్, సైన్స్‌లలో ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అలాగే చిత్రలేఖనం, యోగ, కరాటే తదితర అంశా లలో శిక్షణ ఇస్తారు.

సమ్మె నోటీసు ఇచ్చిన ఆశా కార్యకర్తలు | 8 | జిల్లాలో ఉన్న పాకిస్థానీయులను వెళ్లగొట్టాలి

మానేరుపై వంతెన నిర్మించరూ..

- కిష్టంపేట-బోర్నపల్లి మధ్య ప్రతిపాదనలు
- వంతెన నిర్మాణంతో రెండు జిల్లాల ప్రజలకు ఉపయోగం
- వేసవిలో మట్టిరోడ్డుపై కొనసాగుతున్న రాకపోకలు

కాల్వశ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట, బోర్నపల్లి మధ్యన మానేరుపై వంతెన కలగా మిగిలింది. మండలం నుంచి భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాలకు, పరకాలకు వెళ్ళేందుకు మానేరుపై వంతెన లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు. భూపాలపల్లి, పరకాల, చిట్యాల, టేకుమట్ల తదితర మండలాల నుంచి వేములవాడ, కరీంనగర్, పెద్దపల్లికి వెళ్లాలంటే ఈ ప్రాంతంలో మానేరుపై వంతెన నిర్మించాల్సి ఉంది. ఈ మండలం నుంచి భూపాల పల్లి, పరకాల కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వంతెన లేకపోవడంతో భూపాలపల్లికి వెళ్లేందుకు ఓదెల, కాల్వశ్రీరాంపూర్ ప్రాంత ప్రజలు జమ్మికుంట, మంథని నుంచి తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడు తుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దూరం ఎక్కువగా ఉండడంతో సుమారు వంద కిలోమీటర్లు అదనంగా ప్రయాణం, సమ యం, డబ్బు వృథా అవుతున్నాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.



కిష్టంపేట బోర్నపల్లి మధ్యన ఉన్న మానేరు

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గ్రామాలు, భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గ్రామాలు పక్కపక్కనే ఉంటాయి. రెండు మండలాల మధ్య మానేరు ఉండడంతో ప్రయాణం దూరం ఏర్పడుతుంది. వేసవికాలం వచ్చిందంటే మానేరులో మట్టి పోసి దారి ఏర్పాటు చేసుకుంటారు. ఈ వేసవిలో కూడా మానేరులో పోసిన మట్టి రోడ్డు తోనే ప్రయాణాలు కొనసాగుతున్నాయి. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పెద్దపెల్లి, సుల్తానాబాద్ మండలాల నుంచి ఈ మట్టి రోడ్డు ద్వారా రోజు వందలాది వాహనాలు బోర్నపల్లి నుంచి భూపాలపల్లి జిల్లాకు వెళుతున్నాయి. భూపాలపల్లి జిల్లా నుంచి ఈ మండలాలతో పాటు కరీంనగర్, వేముల వాడకు వెళ్ళేవారు కూడా వేసవిలో మానేరులో పోసిన మట్టిరోడ్డు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. హన్మాన్ దీక్ష చేపట్టిన భక్తులు ఈ మార్గం మీదుగా కిష్టంపేట పేట నుంచి కొండగట్టు వెళుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితం పరకాల మాజీ ఎంపీ స్వర్గీయ జగ్గారెడ్డి కిష్టంపేట, బోర్నపల్లి మధ్యన మానేరు వాగుపై వంతెన కోసం సర్వే కూడా చేయించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని రెండు మండలాల ప్రజలు ఎంతో ఆశపడ్డ నిధులు మంజూరు కాలేదు. అనంతరం ఎంతోమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు మారినా ఇంతవరకు ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. మానేరు పై వంతెనకు నిర్మాణం ప్రతిపాదనల వరకే నిలిచిపోయాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం జరుగితే మంథని మండలానికి చెందిన రైతులు ఓడేడు ద్వారా గరివిళ్ళపల్లి, కిష్టంపేట నుంచి పత్తిని జమ్మికుంట మార్కెట్ కు వెళ్లేం దుకు సులువుగా ఉంటుంది. ప్రస్తుతం వేసవికాలంలో మానేరులో దారి కోసం మట్టి పోయడం వలన ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే మానేరులో నీరు ఉన్న కారణంగా ప్రయాణికులు చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి మానేరుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కన్నతల్లి కర్కశత్వం

- ప్రియుడితో కలిసి 15 రోజులుగా కుమారుడిపై దాడి
- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అరుష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి, ఆమె ప్రియుడి కర్క శత్వానికి ఐదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన మంగళారపు అరుష్(5) అనే బాలుడు తల్లి, ఆమె ప్రియుడు కొట్టిన దెబ్బలకు స్పృహతప్పి పడిపోగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మంగళారపు మాధవి, అరుణ్‌కుమార్‌లకు అరుష్(5), ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. మాధవి భర్త అరుణ్‌కుమార్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం కిడ్నీలు ఫెయిలై మృతిచెందాడు. బీడీ కార్మికురాలిగా పనిచేసే మాధవి కొంత కాలంగా ఓ మెడికల్ షాప్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం అదే మెడి కల్ షాప్‌లో పనిచేసే సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో ఉంటున్న సామాల బాలకిషన్‌తో పరిచయం ఏర్పడింది. ఇటీవలనే ఇద్దరు పిల్లలతో కలిసి మాధవి సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలోని అద్దె ఇంట్లోకి మకాం మార్చింది. తల్లి మాధవి, ఆమె ప్రియుడు బాలకిషన్‌లు 15 రోజులుగా కుమారుడు అరుష్(5)పై దాడిచేసి కొడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాలుడు అరుష్ తలకు గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో తల్లి, ఆమె ప్రియుడు ఇద్దరు కలిసి స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించినప్పటికీ బాలుడు స్పృహలోకి రాకపోవడంతో పరిస్థితి విషమించిందని వైద్యులు తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. బాలుడి తాత లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బి గితె

సిరిసిల్ల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న సిరిసిల్ల పట్టణానికి చెందిన మహ్మద్ అహ్మద్(23) అనే యువకుడిని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్ బి. గితె తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన అహ్మద్‌పై 15 గంజాయి కేసులు నమోదయ్యాయని, 5 కేసుల్లో పరారీలో ఉన్నాడన్నారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయిన్‌పల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్లలో నమోదైన 15కేసుల్లో సిరిసిల్ల టౌన్‌లో 4, చందుర్తిలో 1 కేసులో పరారీలో ఉన్నాడన్నారు. దీంతో అహ్మద్ సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద ఉన్నట్లు తెలుసుకున్న టౌన్ సీఐ కె. కృష్ణ వెళ్లి అరెస్ట్‌చేసి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగుచేసినా, అక్రమ రవాణా చేసినా 8712656392కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

గంగాధర, మే 6 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో 12 ట్రాక్టర్ల ఇసుక డంపులను గుర్తించినట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. గ్రామంలో అక్రమంగా ఇసుక డంపు చేసినట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 12 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించినట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

అరచేతిలో ఆర్టీసీ సేవలు

క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో అందుబాటులోకి



ఆర్టీసీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యూఆర్‌కోడ్ కీచైన్‌లు

భగత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు చేరువయ్యేందుకు పలు సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యాప్‌ల ద్వారా ప్రయాణికులు ఈ సేవలు పొందవచ్చు.

కొత్త తరహాలో..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే పలు రకాల యాప్‌ల ద్వారా ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ బస్ బుకింగ్, టికెట్ బుకింగ్, గమ్యం, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ యాప్‌లు ఉంటాయి. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ప్రయాణికుల వివరాలు పొందుపరిస్తే ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు.

సేవల వివరాలు...

మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో, మన వాళ్లు వస్తున్న బస్సు ఎక్కడి వరకు వచ్చిందో, ఎంత సమయం పట్టవచ్చు, గమ్యస్థానం ఎంత సేపటిలో చేరుతారో గమ్యం యాప్ ద్వారా తెలుసు కోవచ్చు. రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల వివరాలు, సమాచారాన్ని సైతం అందుబాటులో ఉంచారు. సలహాలు సూచనలే కాకుండా ఆన్‌లైన్‌లో మనకు కావాల్సిన చోటుకి టికెట్స్ రిజర్వు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది. ఆర్టీసీ సేవలపై ఎలాంటి ఫిర్యాదులున్నా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వివాహాది శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు బస్సులను రాయితీ విధానంలో యాప్‌ల ద్వారా తక్కువ ధరకే బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది.

ఆర్టీసీని ఆదరించండి
బి రాజు, రీజినల్ మేనేజర్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు ప్రయాణీకులకు మరింత చేరువయ్యే విధంగా క్యూఆర్ కోడ్ రూపకల్పన చేసింది. ప్రయాణీకులు కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీ సమాచారం అందుబాటులోకి వస్తుంది. యాప్‌ల ద్వారా అందిస్తున్న ఆర్టీసీ సేవలను ప్రయాణీకులు వినియోగించుకుని ఆర్టీసీ ఆదరించాలి.

కీ చైన్‌ల ద్వారా ప్రచారం...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌లు ముద్రించిన కీ చైన్‌లను తయారు చేసింది. కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆర్టీసీ సేవలన్నీ అందుబాటులోకి వస్తాయి. కీచైన్‌లను ప్రయాణీకులకు వివిధ రూపాల్లో అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఓదెల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ గేటు సమీపంలో మంగళవారం రైలు ఢీకొని ఇదే గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మి (70) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో ఉన్న బంధువుల ఇంటికి బస్సులో వెళ్లేందుకు రైల్వేలైన్ దాటుతోంది. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో లక్ష్మి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

కాట్రపల్లిలో ఎలుగుబంటి సంచారం

హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఎలుబంటి సంచారంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని కుందేళ్ల గుట్ట సమీపంలో ఎలుగుబంటి పిల్లలతో సంచరిస్తూ మంగళవారం గ్రామస్తులకు కంటపడటంతో వారు వెంటనే పరుగులు పెట్టారు. ఎలుగుబంటి సంచరిస్తుండటంతో గ్రామస్తులు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎలుగుబంటి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి, బిట్ల శ్రీకాంత్, గ్రామస్థులు కోరుతున్నారు.

పాతకక్షలతో దాడి

జగిత్యాలరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాలముకుందంపై పాతకక్షలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ముద్దసాని గంగాధర్ కర్రతో దాడిచేసి గాయపరిచినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బాలముకుందంకు, ముద్దసాని గంగాధర్‌లకు గత కొన్ని రోజులుగా గ్రామ అభివృద్ధితో పాటుగా గ్రామ కంఠం, రోడ్డునిర్మాణాలకు సంబంధించి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో బాలముకుందంపై కోపం పెంచుకున్న ముద్దసాని గంగాధర్ మంగళవారం ఉదయం సమయంలో గ్రామ పంచాయితీవద్ద ఉన్న బాలముకుందంపై వెనుకవైపు నుంచి కర్రతో దాడిచేసి గాయపర్చాడు. తీవ్రగాయాలైన బాలముకుందంను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వెనుకవైపు వెన్నుబాగం లోపల బలమైన గాయాలు కాగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆస్పత్రిలో బాలముకుందంను పరామర్శించారు. కారణాలను తెలుసుకున్నారు.

ఐదుగురిపై అదనపు కట్నం కేసు

జమ్మికుంట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం అత్తింటి వారు వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన గాజనేని రవళికి ఇల్లందకుంట మండలం రాచపల్లికి చెందిన ఉమ్మనవేణి మహేష్‌కు గత ఏడాది ఫిబ్రవరి 11న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఐదు లక్షల నగదు, తొమ్మిది తులాల బంగారం, ఇతర పెట్టుపోతలతో ఘనంగా పెళ్లి జరిపించారు. రెండు నెలలు బాగానే ఉన్న మహేష్ తరుచూ మద్యం సేవిస్తూ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అత్త ప్రమీల, మామ మల్లయ్య, ఆడపడుచు మౌనిక, ఆమె భర్త మల్లేష్ సైతం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రియల్ ఎస్టేట్ పేరుతో రూ.93లక్షల మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ ● కేసు నమోదు

జమ్మికుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో రియల్ ఎస్టేట్ పేరుతో ఓ మహిళ వద్ద రూ.93లక్షలు తీసుకు ని మోసం చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మి కుంటకు చెందిన పోనగంటి కావ్యకు అదే జమ్మికుంటకు చెందిన మ్యానకొండ సాయి కిరణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం అయ్యాడు. తక్కువ ధరకు ప్లాట్లు, భూమి ఇప్పిస్తానని చెప్పి విడుతల వారీగా రూ.93 లక్షలు తీసుకున్నాడు. ప్లాట్, భూమి ఎక్కడ అని అడిగితే ఇన్ని రోజులు దాటవేసుకుంటూ వచ్చాడు. లాభం లేదని గ్రహించిన సదరు మహిళ గట్టిగా నిలదీయడంతో నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వరి ధాన్యం దగ్ధం

మంథనిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెంద గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరెపల్లి సాంబయ్య అనే రైతుకు చెందిన వరి పంట కుప్ప దగ్ధమైంది. మూడున్నర ఎకరాల్లో సాంబయ్య మేల్, ఫిమేల్ సాగు చేశాడు. చేతికి వచ్చిన పంటను కోసి కల్లంలో కుప్ప వేయగా మంటలు అంటుకున్నాయి. విషయాన్ని మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్ప టికే పంట దగ్ధమైంది. సుమారు రూ.5 లక్షల వరకు పంట నష్టం జరినట్లు అంచనా వేస్తున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని హుస్సేన్‌మియా వాగు పరివాహక ప్రాంతంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు అంటించారు. దీంతో రైతు జంగా రాజయ్యకు చెంది న ఎకరం 10గుంటల బాస్మతి వరికుప్ప, కొరకండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 28గుంటల బాస్మతి వరికుప్ప కాలి బూడిదైంది. వరి కొయ్యకాలు కాలబెట్టడం వలన పక్కనే ఉన్న వరి పొలానికి మంటలు అంటు కోవడంతో చుట్టుపక్కల రైతులు ఆర్పివేశారు.


ఆరెందలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మండల కేంద్రంలో హుస్సేన్‌మియావాగు పక్కన యరబాటి రాజేశ్వర్‌రావుకు చెందిన మూడు ఎక రాల ఆయిల్ పామ్ తోట అగ్నికి ఆహుతైంది. మంగ ళవారం గుర్తుతెలియని రైతులు కోసిన వరిపొలం కొయ్యకాలు తగలబెట్టడంతో మంటలు వ్యాపించి ఆయిల్‌పామ్ తోటతోపాటు డ్రిప్పు కూడా కాలి పోయింది. రూ. 40వేల నష్టం జరిగింది.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

మెట్‌పల్లి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి రూరల్ మండలంలోని వెల్లుల్ల, రామచంద్రంపేట గ్రామాల్లో తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో సోమవారం రాత్రి చోరీలు జరిగాయి. మంగళవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రంపేటలోని అల్లిక సంజన అనే వివాహిత నెల రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో మంగళవారం ఉదయం పక్కింటి వారు ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి రూ.4వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామంలోని పుల్లూరి గంగమణి ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో సమాచారం అందుకొని వచ్చి చూసేసరికి ఇంట్లోని రూ.10వేలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బొడ్డు లింగాధర్, పెండం నరేందర్ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం తిరుపతి టూర్ వెళ్లారు. వారి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి ఉండేసరికి పక్కింటి వారు సమాచారం అందించారు. బాధితుల బంధువులు చూసేసరికి పెండం నరేందర్ ఇంట్లో రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేములవాడ : వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్‌లోని తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. స్థానికంగా ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న తాటికొండ సంతోష్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు. సుమారు 25 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అభివృద్ధి పేరుతో రాజన్న ఆలయాన్ని మూసివేయడం సరికాదు

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పేరిట జూన్ నెల నుంచి మూసివేయాలని అధికారులు నిర్ణయించడం సరికాదని వేములవాడకు చెందిన పలువురు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం దేవస్థానాన్ని జూన్ 15 నుంచి మూసివేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పద్మశాలి సంఘం భవనంలో వివిధ వర్గాలకు చెందిన పలువురు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాజన్న రక్షణ సమితి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అభివృద్ధి పేరిట దేవాలయాన్ని మూసివేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీన వేములవాడ బంద్ పాటించాలని నిర్ణయించారు. అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయాన్ని మూసివేస్తాం అంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న అనుబంధ ఆలయాలను తొలగించినా ఊరుకొనేది లేదన్నారు. రాజన్న ఆలయం ఆగమశాస్త్రం ప్రకారం లేదని అధికారులు చెబుతున్నారని, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ఆవరణలో దర్గా ఉండవచ్చా అని ప్రశ్నించారు. కేవలం 76 కోట్ల రూపాయలతో మాత్రమే పనులు పూర్తవుతాయా అని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం రాజన్న ఆలయాన్ని మూసివేస్తారని ప్రచారం జరగడంతో స్థానికులతో పాటు భక్తులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉజ్జయిని, కాశీ, అయోధ్య లాంటి ఆలయాలు మూసి వేయకుండానే అభివృద్ధి చేశారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశిస్తూ ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నాడని, ఇట్లాంటి పరిస్థితుల్లో అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేయడం సరైనది కాదని అన్నారు. వేములవాడ రాజ న్న రక్షణ సమితి చేసే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటానని బండి సంజయ్ కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయ కుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కుమ్మరి శంకర్, సంటి అంజిబాబు, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, మోటూరి మధుసూదన్, పిన్నింటి హనుమాన్లు, కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సిరిసిల్లలో సీపీఐ పట్టణ మహాసభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవనంలో మంగళవారం పట్టణ మహాసభలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవిల ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ మహిళా నాయకురాలు సుంకరపెల్లి శాంతాబాయ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎంలో పని చేసిన ఏలిగేటి రాజశేఖర్, షకీల్‌తోపాటు ఎనిమిది మంది నాయకులు చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో సీపీఐలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, సీపీఐ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఎర్రజెండా కార్మికుల పోరాటాలు, ఆవేదన కష్టాల నుంచి పుట్టిన జెండా ఎర్ర జెండా అన్నారు. 1925లో పరిపాలన వలసవాదులైన నైజాం పాలకుల చేతిలో ఉండేదని, అప్పుడు ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ హక్కులు ఏమీలేవన్నారు. ఆనాటి దుస్థితి నుంచి తెలంగాణలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దూం మోయిన్, తెలంగాణ సాయుధ పోరాటం చేసి నైజాం పాలకులను గద్దెదించిన చరిత్ర అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే నైజాం గద్దె దిగేవాడే కాదని ఇది ముమ్మాటికీ వాస్తవం అని అన్నారు. అలాంటి పోరాటంలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. ఇప్పటికీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆగడాలని పెంచి పోషిస్తూ హిందూ దేశమని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. భారతదేశంలో విభిన్న మతాలు సంస్కృతులు సంప్రదాయాలు, భాషలు భావాలు నిలయంగా ఉన్న దేశం అన్నారు. కార్మికులు పోరాటం చేసి 44 చట్టాలను సాధించుకుంటే కార్మికులు సమ్మె చేసే హక్కును హరిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తిగా కాలేదని, అంగన్‌వాడీలకు, ఆశాలకు, మధ్యాహ్నం భోజనం కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై కార్మిక సంఘాలు పోరాటం చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మహాసభల్లో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, కుర్ర రాకేష్, కేవి అనసూయ, అజ్జ వేణు పాల్గొన్నారు

ఆస్తిలో వాటా కోసం ఆందోళన


జఫరోద్దీన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): అత్తగారి పేరు మీద ఉన్న ఆస్తిని తన మామ ముగ్గురు కూతుళ్లు ఉండగా రెండో కూతురు పేరున రిజిస్ట్రేషన్ చేశారని జగిత్యాల మున్సిపల్‌లో ఆందోళనకు దిగిన ఓ యువకుడు తలను బీరువాకేసి కొట్టుకోవడంతో స్పృహ కోల్పోయాడు. వివరాలలోకి వెళితే..జగిత్యాలకు చెందిన అఫ్సరీ బేగం అహ్మద్‌ఖాన్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అఫ్సరీ బేగం మరణించగా ఆమె భర్త అహ్మద్‌ఖాన్ తన భార్య పేరుపై ఉన్న ఆస్తిని రెండో కూతురుకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీనిపై అహ్మద్‌ఖాన్ అల్లుడు జఫరోద్దీన్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన చేపట్టాడు. తలను బీరువాకు కొట్టుకోవడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది వెంటనే జఫరోద్దీన్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నెలలోపే మహిళా కమిషన్ ఫిర్యాదుల పరిష్కారం

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద


కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద దంపతులు

మల్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను నెల రోజులలోపే పరిష్కారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైరపర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. మంగళవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో కన్న ఇప్పుడు కమిషన్‌కు ఫిర్యాదులు పెరిగిపోయాయని వాటికి కౌన్సెలింగ్ ఇస్తూ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సహజీవనం ఫిర్యాదులు అనేకం వస్తున్నాయన్నారు. ఆకర్షణ, ప్రేమ తదితర కారణాలతో సహజీవనం చేయడం సమాజానికి, వ్యక్తిగతంగా మంచిది కాదన్నారు. ఇటీవల మగవాళ్ల వైపు నుంచి కూడా ఫిర్యాదులు వస్తుండడంతో వాటికి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు నేరెళ్ల శారద పేర్కొన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధిపై చర్చిస్తాం

కొండగట్టు ఆలయం అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించనున్నట్లు నేరెళ్ల శారద అన్నారు. కొండగట్టు ఆలయ అభివృద్ధి, వసతి తదితర సౌకర్యాల కోసం ప్రభుత్వం తరుపున కృషి చేస్తామని తెలిపారు. టీటీడీ వంద గదుల నిర్మాణంపై ఏపీ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతామని శారద పేర్కొన్నారు.

భూసేకరణ పనులు
వేగంగా చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 80 అడుగుల మేరకు రోడ్డు వెడల్పు
- ఆందోళనకు దిగిన నిర్వాసితులు



వేములవాడలో భూ సేకరణ సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మూల వాగు నుంచి రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పునకు 50ఏళ్లుగా ఆటంకాలు ఎదురవుతున్నాయని, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని, ఈసారి ఖచ్చితంగా 80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించి తీరుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు వెడల్పులో నష్టపోయే ఇళ్ల యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు 47కోట్ల 80 లక్షల రూపాయలు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. రోడ్డు వెడల్పు నిర్వాసితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని, నష్టపరిహారం కింద గజానికి 30వేల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు.

80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించేందుకు రోడ్డుకు మార్కింగ్ జరుగుతోందని, ఈమేరకు 315 ఇళ్లలో 257 ఇళ్లకు సంబంధించిన సర్వేను ఇంజనీరింగ్ అధికారులతో కూడిన నాలుగు బృందాలు పూర్తిచేశాయని, మిగతా సర్వే వేగంగా పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు తమకు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తిచేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రోడ్డు వెడల్పునకు సంబంధించిన సర్వే నిర్వహించకుండా హైకోర్టు స్టే మంజూరు చేసిందంటూ పలువురు ఇళ్ల యజమానులు అధికారులను అడ్డుకున్నారు. అయితే హైకోర్టు కేవలం నాలుగు ఇళ్లకు సంబంధించి మాత్రమే ఆదేశాలు జారీ చేసిందని, మిగతా ఇళ్లకు సంబంధించిన సర్వేను పూర్తిచేస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో రోడ్ల వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు.



రాజన్న ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఇళ్ల యజమానులు

మదర్ ఆఫ్ గేమ్స్..

రన్, త్రో, జంప్, వాక్‌ల కలయిక

నేడు వరల్డ్ అథ్లెటిక్స్ డే

అథ్లెటిక్స్









కరీంనగర్ స్పోర్ట్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌ను మదర్ ఆఫ్ గేమ్స్ అని కూడా పిలుస్తారు. వ్యక్తిలోని శక్తి సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఇందులోని అంశాలు వేదికగా నిలుస్తాయి. ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌కు ప్రత్యేక గుర్తింపు. అథ్లెటిక్స్‌లోని రన్, త్రో, వాక్, జంప్ వంటి ఆటలు వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. మనిషి ఆరోగ్యంగా ఉంటే ప్రపంచం ఆరోగ్యంగా ఉంటుందనే నానుడిని నిజం చేయాలని 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ప్రారంభించింది.

చిన్నాపెద్ద వయోభేదం లేకుండా సర్వ మానవాళి ఆరోగ్యంగా ఉండాలనేది ప్రపంచ అథ్లెటిక్స్ డే ప్రధాన లక్ష్యం. అథ్లెటిక్స్ ఫర్ ఏ బెటర్ వరల్డ్ అనేది ఐఏఏఎఫ్ ప్రధాన నినాదం. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొన డానికి, ఫిట్‌నెస్ ముఖ్యం. ఇందులో భాగం గా ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఏటా మే 7వ తేదీన ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్‌లో పాల్గొనేలా యువతను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రాథమిక లక్ష్యం.

అథ్లెటిక్స్‌లో రాణించాలంటే

శారీరక దారుఢ్యానికి తోడు నిర్దిష్టమైన ఎత్తు, బరువు ఉన్న విద్యార్థులు, యువత అథ్లెటిక్స్‌లో రాణిస్తారు. 12 ఏళ్ల వయస్సు నుంచి శిక్షణ మొదలుపెడితే భవిష్యత్‌లో రాణించ గలుగుతారు. శిక్షణకంటే ముందు విద్యార్థుల శరీరాకృతి, శక్తి సామర్థ్యాలను అంచనావేసి ఏ అంశానికి సరిపోతారన్నది గుర్తించాలి. ఇందుకు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి. దృఢమైన శరీరం గలవారు స్ప్రింటర్లుగా, ఎత్తుగా ఉండి ఛాతి లోపలికి ఉన్నవారు లాంగ్ డిస్టెన్స్ రన్నర్స్‌గా, బల ప్రదర్శనలో ముందుండేవారు త్రోలో రాణిస్తారు.

అథ్లెటిక్స్‌లోని అంశాలు

పరుగు: 100, 200, 400 మీటర్ల షార్ట్ డిస్టెన్స్ రన్, 800, 1500 మీటర్ల మిడిల్ డిస్టెన్స్ రన్, 3000 మీటర్ల స్టీపుల్ చెస్ పరుగు.


త్రోస్: జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హ్యామర్ త్రో.

జంప్: హైజంప్, లాంగ్ జంప్, పోల్ వాల్ట్, ట్రిపుల్ జంప్.

కంబైన్డ్ అంశాలు: ట్రైయాతలాన్, పెంటతలాన్, హెప్టాథ్లాన్, డెకథ్లాన్.

జిల్లాలో ఆదరణ

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ ఆదరణ ఉంది. కరీంనగర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నందెల్లి మహిపాల్, కడారి రవి వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఏటా అథ్లెటిక్స్ పోటీలను జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలోని రుక్మాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్, మేడిపల్లి, కోహెడ, హుస్నాబాద్, కరీంనగర్, శనిగరం, గంగాధర, దాచారం, చొప్పదండి, చింతకుంట, మానకొండూర్ తదితర ప్రాంతాల నుంచి ఎందరో అథ్లెటిక్‌లు వెలుగులోకి వచ్చారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు.



వ్యాయామ ఉపాధ్యాయులుగా

గతంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన కడారి రవి, శ్రీనివాస్, డి.శ్రీనివాస్, హరికిషన్, కె.సమ్మయ్య, చంద్రశేఖర్, బాబు శ్రీనివాస్, బి.రాజగోపాల్ చారి, డాక్టర్ ఇజాజ్ అహ్మద్ వ్యాయామ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యంలో నూతన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు.

జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి

నందెల్లి మహిపాల్, అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో అథ్లెటిక్స్‌కు విశేష ఆదరణ లభిస్తుంది. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభచాటుతున్నారు. పలు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు భత్యాలతోపాటు క్రీడా దుస్తులను అందిస్తున్నాం. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాం.

సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి

కడారి రవి, అథ్లెటిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



జిల్లాలో అథ్లెటిక్స్ నిర్వహణకు అంబేద్కర్ స్టేడియంలోని మైదానంలో సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసినా దూరంగా ఉండడంతో నగర క్రీడాకారులు ఆ ట్రాక్‌పై శిక్షణ పొందేందుకు కష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నా స్పాన్సర్ అవసరం ఉంది. జిల్లా అథ్లెట్స్ ఆర్మీ, రైల్వే, పోలీస్ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు.

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

మల్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఇరవై వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

కూలిన చలువ పందిళ్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కోనేరు పక్క నుంచి పాత కార్యాలయానికి వెళ్లే మార్గంలో చలువపందిళ్లు కూలి భక్తులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి వీచిన గాలి దుమారానికి పం దిళ్లు పడిపోగా వాటి కింద పడుకున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మంగళవారం వేలాదిగా భక్తులు తరలి వస్తారని తెలిసీ కూలిన పందిళ్లను కనీసం సరిచేయించకపోవడం పట్ల భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో భక్తులు ఊరేగింపుగా బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. పట్నాలు వేసి అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అనంతరం నైవేద్యం, కల్లసాక పెడుతూ పిల్లాపాపలు, పాడి పంటలను చల్లంగా చూడమ్మ బద్దిపోచమ్మ తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మ ఆలయం లోపల భక్తులు

బహుముఖ ప్రజ్ఞాశాలి స్వామి

- రచయిత, నటుడు, గాయకుడిగా రాణింపు
- సింగరేణిలో పదవీ విరమణ
- ప్రజా పాటల ప్రస్థానానికి అర్ధశతాబ్దం



పాట రికార్డింగ్‌లో కవ్వంపల్లి స్వామి

కోల్‌సిటీటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రచయితగా, నటుడిగా, గాయకుడిగా సింగరేణి కార్మిక క్షేత్రంలో రాణిస్తున్నాడు కవ్వంపల్లి స్వామి. అర్ధశతాబ్దంగా కళారంగంలో, ఉద్యమాల్లో తన కలంతో పాటలకు ప్రాణం పోశాడు. ప్రజా నాట్యమండలి కళాకారుడిగా ప్రజల్లో, కార్మికుల్లో చెరగని ముద్ర వేసున్నాడు స్వామి.

గోదావరిఖనికి చెందిన కవ్వంపల్లి స్వామి బహుముఖ ప్రజ్ఞతో యాభైఏళ్ళుగా ప్రజా కళాకారుడిగా సేవలందిస్తున్నారు. స్వగ్రామం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు. స్వామి తండ్రి వెంకటయ్య సింగరేణి కార్మికుడు కావడంతో గోదావరిఖనిలోనే స్వామి విద్యాభ్యాసం సాగింది. అనంతరం సింగరేణిలో క్యాజువల్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూనే కళాకారుడిగా తన గళాన్ని వినిపించాడు. స్పెషల్ గ్రేడ్ క్లర్క్‌గా 2019లో పదవీవిరమణ చేశారు. విద్యార్థి దశ నుంచి అప్పటి కార్మిక నాయకుడు దివంగత మాదిరెడ్డి భాస్కర్‌రావు ప్రోత్సాహంతో 1973లో ప్రజా నాట్యమండలిలో చేరాడు.

1974లో విజయవాడలో జరిగిన రాష్ట్ర మహాసభలకు హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచి సీపీఐ-ప్రజా సంఘాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పదవులు నిర్వహించి ప్రస్తుతం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ సమితి సభ్యుడిగా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా గాయక బృందంలో ప్రధాన గాయకుడు స్వామి. నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శిక్షణా శిబిరాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించాడు. నాటి సినీనటులు సి.నాగభూషణం, నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ళ ప్రతాపరెడ్డిల నాయకత్వంలో వందేమాతరం శ్రీనివాస్‌తో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అక్కో అక్కో అక్కా... సూడు మల్లేశా..., ఏమి రాజ్యం ఎన్నియల్లో, కూలినాలీ నాలన్నలారా, సింగరేణి కార్మికా వంటి గీతాలు స్వామి కలం, గొంతు నుంచే జాలువారినవే. కళా ప్రదర్శనల్లోనే కాకుండా క్యాసెట్లు, సిడిల్లో స్వామి పాటలు రికార్డయ్యాయి. 1978లో ఆలిండియా రేడియో కార్మికుల కార్యక్రమంలో స్వామి పాటలు ప్రసారమయ్యాయి. కోలిండియా స్థాయిలో 25సార్లు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలు అందుకున్నారు. గీత్, భజన్ ఈవెంట్లలో బహుమతులు పొంది సింగరేణికి ఖ్యాతిని తీసుకువచ్చారు. ప్రజాకవి వంగపండు రాసిన భూబాగోతం, నృత్యనాటికకు నేపథ్యగానం అందించారు. ఈ నృత్య నాటికను 1982లో దాదర్, వర్లీ(బొంబాయి)లోని తెలుగు ప్రజల మధ్య ప్రదర్శించారు.

అంతా ఒక్కటే, ఉక్కుపిడికిళ్ళు తూర్పు వంటి రంగస్థల నాటికలతో పాటు వీధినాటికలు కాలేరోళ్ళు, సీసపద్యం మొదలైన వాటిలో ప్రదర్శించడంతోపాటు వీటిలో నటించడం ద్వారా స్వామికి గుర్తింపును తీసుకువచ్చాయి.

రచయితగా రాసిన గేయాల్లో కొన్ని...



దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తితో స్వామి

- నేలతల్లినే నమ్ముకొని రైతన్నా...
- బిరబిర బీడీలు చుట్టే ఓ అక్కా...
- నల్లా బంగారానికి నష్టమెట్లవచ్చెరా...
- వీధుల వెంట ....రమేషా...సురేషా...
- ఎడారి దేశంలో నీబతుకు ఎడారే తమ్మీ...
- మల్లెపల్లి రాజమా... పల్లె ఎర్రమల్లెవు...
- సిరిసంపదలు గల్ల సిరిసిల్ల పట్నంలో...
- జొన్నల మల్యాల బిడ్డ జోహర్లు బానయ్య

" వీధుల వెంట...గల్లీ పొంట రమేషా... సురేషా అనే పాట జోష్ సినిమాకి జోష్ నిచ్చింది.

2012లో తెలంగాణ కోసం గద్దర్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకత్వాన సాగిన గోలేటి నుంచి కొత్తగూడెం వరకు బాయి నుంచి బాయికి కార్యక్రమంలో 15 రోజుల పాటు సాంస్కృతిక దళానికి స్వామి నాయకత్వం వహించారు.

పాటకు పర్యాయపదంగా...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సీడీల్లో స్వామి పాటలు దేశం కోసం, ఎర్రజెండా నీడలో, రణభేరి, ఢంకానాదం, ఎర్రకుంకుమ మొదలైన క్యాసెట్లు(సీడీలు)లో స్వామిగళమెత్తారు. కాలేరోళ్ళు, సీసపద్యం నాటికలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఆర్. నారా యణమూర్తి పోరు తెలంగాణ సినిమాలో నటించడంతోపాటు మా భూమి, ఆయుధం నాటకాలను సింగరేణి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రదర్శన ఇవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

సీఎం వ్యాఖ్యలతో

కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుమానాలు

- తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు
- తెలంగాణ ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దుర్మార్గం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు పెద్దలా భావించే సీఎం స్వయంగా నాతో ఏం కాదు.. నేనేం చేయలేని స్థితిలో ఉన్న.. రాష్ట్రం దివాలా తీసింది.. అప్పు పుట్ట లేదు.. అణా పైసా ఎవ్వలిత్తలేరు.. బ్యాంకులకు పోతే దొంగోని లెక్క చూస్తున్నరు.. అంటూ వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటదా..? ఉండదా..? అనే అనుమానాలు తెలంగాణ సమాజంలో తలెత్తుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దౌర్భాగ్యం.. సిగ్గుచేటని అన్నారు. ఆయన మాటలతో దేశవ్యాప్త చర్చ సాగుతోందని, తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పడిపోయారని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రధా ని, కేంద్ర మంత్రులను కలిశానని రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నారని అక్కడ అభినందనలు తెలుపుతూ ఇక్కడ తనకు అపాయింట్‌మెంటు ఇవ్వట్లేదని సీఎం అబద్ధాలు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఢిల్లీకి పోతే చెప్పులెత్తుకుపోయేటోని లెక్క చూస్తుండ్రని, ఆ కల్చర్ కాంగ్రెస్‌లో ఉంటుంది కావచ్చని అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని, కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పుల పాలు, అధోగతి చేసిండ్రని ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు, మేం చెప్పినమని అన్నారు. ఎలక్షన్లప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు రావాలని కోరినం, ప్రజలను ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేసినం.. ప్రజలేం చేసిండ్రు.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని మీరు చెప్పితే నమ్మి ఓట్లేసిండ్రని అన్నారు. యేడాదిలోనే అప్పులు తీర్చడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొంటూ అనేక ప్రాంతాల్లో బాండు పేపర్లు రాసిచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు సమాధానం చెప్పాలని ప్రజలు నిలదీస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయడం కోసం సిద్ధంగా ఉన్నామని 2022లోనే ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని విరమించుకోకుండా కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాహుల్, ప్రియాంకగాంధీలు సంవిధాన్‌పై ప్రతిజ్ఞ చేసి చెప్పాలి

తెలంగాణలో జరిగిన గత ఎన్నికల్లో సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని కేసీఆర్ అప్పులు చేశారు మేం తీర్చుతాం.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు ప్రతిజ్ఞ చేసి పోయిండ్రు.. అదే సంవిధాన్ బుక్ పట్టుకుని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు తెలంగాణ రాష్ట్రానికి రావాలని, ప్రజలను మేం సమీకరించి బహిరంగ సభను పెడ్తాం.. ప్రజలు అడిగే ప్రశ్నలకు ప్రతిజ్ఞ చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటాలు వాస్తవమేనని అంగీకరించగలరా..? అని ప్రశ్నించారు. దేశంలో ఉగ్ర, తీవ్ర వాదాన్ని తుద ముట్టించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తుపాకీ ద్వారా సాధించేది ఏమీ లేదని అన్నారు. కర్రెగుట్టల్లో మావోలపై 'ఆపరేషన్ కగార్' పేరిట కేంద్ర బలగాలు వేట సాగిస్తుండడం పట్ల మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలు రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన ఆదివాసీలు, ప్రజలను పొట్టపెట్టుకుంటున్న వారికి మద్దతు పలకడం ఏం నీతి అని ప్రశ్నించారు. మావోలపై నిషేదం ఎత్తివేసే దమ్ము సీఎంకు ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సంజయ్

ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో కొన సాగుతున్న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు.పారిశుధ్య కార్మికులను మంత్రి బండి సంజయ్ సన్మానించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు రమాకాంత్, లక్ష్మణ్, ప్రత్యేక పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్, మల్లేశం, మల్లారెడ్డి, నరేశ్, కిరణ్ నాయక్, గాల్‌రెడ్డి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

పీఏసీఎస్ చైర్మన్ సంపత్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బందులు లేకుండా కేంద్రాల ద్వారా సేకరించి మద్దతు ధర కల్పిస్తున్నామని అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతపండు సంపత్ అన్నారు. ఈ మేరకు ఆంధ్రజ్యోతి తో పలు విషయాలు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి: పీఏసీఎస్ పరిధిలో ఎంత మంది రైతులకు సభ్యత్వం ఉంది ?

చైర్మన్: అప్పన్నపేట సింగిల్ విండోలో 2324 మందికి సభ్యత్వం ఉంది.

ఆంధ్రజ్యోతి : ఇప్పటివరకు ఎంతమంది రైతులకు పంట రుణాలు ఇచ్చారు ?

చైర్మన్ : 579 మంది రైతులకు 5 కోట్ల 10 లక్షల 70 వేల రుణాలు అందించాం.

ఆంధ్రజ్యోతి: ధాన్యం సేకరణకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు ?

చైర్మన్: 17 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వానాకాలం ఏ మేరకు పంట రుణాలు ఇవ్వనున్నారు.

చైర్మన్: రైతులకు స్వల్ప కాలిక, మధ్య కాలిక, బంగారంపై రుణాలు అందిస్తున్నాం. హార్వెస్టర్‌లు, ట్రాక్టర్‌లు, కారులకు రుణ సదుపాయం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : సొసైటీ ద్వారా ఎరువులు ఎలా అందిస్తున్నారు ?

చైర్మన్: అప్పన్నపేటతోపాటు కనగర్తి గోదాంల నుంచి ఎరువులు అందిస్తున్నాం. రాగినేడులో గోదాంను త్వరలోనే ప్రారంభిస్తాం. అప్పన్నపేట సొసైటీ కార్యాలయంలో సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేశాం.

- పెద్దపల్లి రూరల్

జిల్లాలో ఉన్న పాకిస్థానీయులను వెళ్లగొట్టాలి

పెద్దపల్లిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పాకిస్థానీయులను వెంటనే వారి దేశానికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడారు. గత నెల 22న కశ్మీర్ పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను దారుణంగా కాల్చి చంపారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్ చర్యను తిప్పి కొట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని, త్రివిధ దళాలకు పూర్తి అధికారాలను ఇచ్చి దేశ రక్షణ చేపడుతున్నారని వివరించారు. కాశిపేట లింగయ్య, కర్రె సంజీవ్‌రెడ్డిచ రాంసింగ్, కన్నం అంజయ్య, కందుల సంధ్యారాణి, సదానందం, ఓదెలు, తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులను వెళ్లగొట్టే విధంగా చర్యలు చేపట్టాలని రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, గుండబోయిన భూమయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులను టార్గెట్ చేసి హత్య చేశారన్నారు. కార్డెన్ సర్చ్ నిర్వహించి పాకిస్థానీలను వెళ్లగొట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణతో పాటు రామగుండంలో ఎవరైనా పాకిస్థాన్ పౌరులు ఉంటే పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అపర్ణ, కోడూరి రమేష్, కుమారస్వామి, నర్సింగ్, రవీందర్, పృథ్వీ పాల్గొన్నారు. అలాగే సోమారపు లావణ్య ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, పాకిస్థానీయుల వీసాను రద్దుచేసి వెళ్లగొట్టాలని డిమాండ్ చేశారు. సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, గోపగోని నవీన్, కుమార్, మల్లేష్, శ్రావణ్, రాజు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న పాకిస్థాన్ జాతీయులు వెంటనే దేశం నుంచి వెళ్లిపోవా లని బీజేపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు మంగళవారం తహసీల్దార్ జగదీశ్వర్ రావుకు పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. గత నెలలో కశ్మీర్‌లోని పహ ల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులను టార్గెట్ చేసి జరిపిన కాల్పులు పిరికిపందల చర్య అన్నారు. ఉప్పుల కుమార్, తోట శ్రీధర్, చీర్లంచ తిరుపతి, పూరెల్ల దిలీప్, దాసరి కృష్ణ, కారుపాకల శంకర్, కొమ్ము రాజేందర్, మహేందర్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాప్యం

(5వ పేజీ తరువాయి)

గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారుల ఎంపిక ముందుకు సాగడం లేదు. జనవరి 23 నుంచి 25 వరకు నిర్వ హించిన గ్రామ, పట్టణ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారి పేర్లను ప్రకటించారు. వారంతా తమకు ఎప్పుడు ఇళ్లు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 903 ఇళ్లు మంజూరు చేయగా, ఇంకా 2,599 ఇళ్లు, రామగుండం నియోజకవర్గంలో 183 ఇళ్లు మంజూరు చేయగా ఇంకా 3,317 ఇళ్లు, మంథని నియోజకవర్గ పరిధిలో 799 ఇళ్లు మంజూరు చేయగా, ఇంకా వెయ్యి ఇళ్ల వరకు మంజూరు చేయాల్సి ఉంది. లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేస్తున్నారు. అర్హులైన జాబితాలో ఏ ఊరికి ఎన్ని ఇళ్లు ఇవ్వాలి, ఏ పట్టణానికి ఎన్ని ఇళ్లు ఇవ్వాలనే విషయమై ఎమ్మెల్యేలు తర్జన భర్జన పడుతున్నారు. ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తే, ఆ జాబితాపై మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తుది జాబితాను జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి పంపిస్తారు. ఆయన దానిపై ఆమోద ముద్ర వేసిన తర్వాత కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు మరింత సమయం పట్టనున్నది. పథకం ఆరంభమై మూడు మాసాలు గడుస్తున్నా లబ్ధిదారులను ఎంపిక చేయడంలో ఇందిరమ్మ కమిటీలు, ఎమ్మెల్యేలు తీవ్ర జాప్యాన్ని కనబరుస్తున్నారు. స్థానిక నాయకుల సూచ నల మేరకు ఇళ్లు మంజూరయ్యే అవకాశాలు కనబడు తున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి ఇళ్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని అర్హులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సుల్తానాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమిరిశెట్టి తిరుపతి పదకొండు వేల రూపాయలను విరాళంగా అందించారు. శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయ అవరణలో నిర్మాణాన్ని చేపట్టారు. తిరుపతి మంగళవారం ఆలయ నిర్మాణ బాధ్యులు సాయిరి మహేందర్‌కు నగదు అందించారు.

భూములను పరిశీలించిన తహసీల్దార్

గోదావరిఖని, మే 6(ఆంధ్రజ్యోతి): లింగాల శివారులో గల సర్వే నంబర్ 84లో గల సాగు భూములను తహసీల్దార్ వాసంతి పరిశీలించారు. ఆ భూములు ప్రభుత్వ భూములని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని నాగారం లింగాల గ్రామాల రైతులు ఫిర్యాదు చేశారు. తాము భూములను కొనుగోలు చేశామని తమ భూములు లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారని రైతులు అధికారులతో పేర్కొన్నారు. భూములకు సంబంధించిన పత్రాలు ఉంటే కార్యాలయానికి రావాలని తహసీల్దార్ వాసంతి రైతులకు సూచించారు.

బండలవాగు ప్రాజెక్ట్‌ను పండుగలా ప్రారంభించుకుందాం

పాలకుర్తి,మే 6(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని రైతాంగానికి సాగు నీరు అందించే కుక్కలగూడూర్ బండలవాగు ప్రాజెక్టును పండుగల ప్రారంభించుకుందామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ మండల రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం కుక్కలగూగూర్ గ్రామంలో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అంతర్గాం, పాలకుర్తి మండల ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారం టీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమ లు చేస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాల కు ఇచ్చిన హామీలను ఎక్కడ ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సలహదారుడు హర్కల వేణుగోపాల్ రావు, జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు జంగ రాఘవరెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డం తిరుపతి, మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, నాయకులు బయ్యపు మనోహర్‌రెడ్డి, మహేష్, రాజలింగు, ముక్కెర శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను గ్రామానికి చెందిన పలు కుల సంఘాల నాయకులు సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

సైనికుడికి ఘన సన్మానం

కళ్యాణ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కొండ శ్రీనివాస్ 26 సంవత్సరాలు ఆర్మీలో పని చేసి మంగళవారం పదవీ విరమణ పొందాడు. ఆయనను మంగళవారం గోదావరిఖనిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ మనిమయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నారాయణ, శ్రీనివాస్, కృష్ణ, నరేంద్ పాల్గొన్నారు.

మాంసాహార దుకాణాలను తరలించాలి

కళ్యాణ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్ నుంచి మాంసాహార దుకాణాలను తరలించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు విజ్ఞప్తి చేశారు. చికెన్, చేపల వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. వెంటనే మాంసాహార మార్కెట్‌ను తరలించాలని ఆయన కోరారు.

గాలి దుమారానికి మామిడి రైతులకు నష్టం

ఓదెల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం ఉధృతంగా వీచిన గాలి దుమారానికి మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఓదెలకు చెందిన మంద కుమారస్వామి ముదిరాజ్ సంఘంకు చెందిన 9.20 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకొన్నాడు. గాలి దుమారంతో మామిడికాయలు, రాలిపోవడంతో రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఓదెలతోపాటు మడక, గుండ్లపల్లి గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయి నష్టం వాటిల్లింది. హార్టికల్చర్ అధికారులు స్పందించి పరిహారం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.



నేలరాలిన కాయలను చూపిస్తున్న రైతులు

అనర్హులకు ఇందిరమ్మ గృహాలు

ఎలిగేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోటలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గ్రామానికి చెందిన జల్లి రమేష్ మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 24 మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా కొందరు అనర్హులను ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిందన్నారు. తనకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రమేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎంపీడీఓ భాస్కర్‌రావును వివరణ కోరగా ఇందిరమ్మ కమిటీ పంపించిన విధంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగిందని తెలిపారు.

స్టేట్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి

ఓదెల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని మంగళవారం హైదరాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ బాబుకు ఓదెలకు చెందిన బీజేపీ నాయకుడు తాటికొండ కృష్ణమాచారి, వెంకటేశ్వర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఓదెలలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రం ఉందని, యేటా రూ.90 లక్షల మేరకు ఆదాయం వస్తుందని తెలిపారు. స్టేట్ బ్యాంక్, ఏటీఎం లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎస్‌బిఐ బ్యాం కుకు వెళ్లాలంటే దాదాపు 20 కిలోమీటర్ల దూరం వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు.

సీఎం వ్యాఖ్యలు బాధాకరం

మంథని, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ఉద్యోగ, ఉపాధ్యాయ లోకాన్ని బాధించాయని టీఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బహత్ కిషోర్ అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. వాటిని ఏ పథకం ఆపి ఇవ్వాలో మీరే చెప్పండి అని సీఎం మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు మీరు ఇచ్చిన హామీలే అని కొత్తవేం కావన్నారు.

జేఎన్టీయూలో డాక్యుమెంటర్ షార్ట్‌ఫిలిం

రామగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కళాశాల పురోగతిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు రూపొందించిన షార్ట్‌ఫిలింను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, కళాశాల సిబ్బంది మంగళవారం ఆవిష్కరించారు. కళాశాల లైఫ్ స్టైల్ ఆఫ్ 2025 అనే అంశంపై డ్రోన్స్‌తో చిత్రీకరించారు. కళాశాలలోని లైబ్రరీ, హాస్టల్స్, ఫెస్ట్ ఈవెంట్స్‌తోపాటు అనేక అంశాలను షార్ట్ ఫిలింలో పొందుపరిచారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, పరిపాలనాధికారి సుమన్, పిడి కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌పాల్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ ఇచ్చిన ఆశ కార్యకర్తలు

పెద్దపల్లి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలు ఈనెల 20న సమ్మెలో పాల్గొంటారని మంగళవారం రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రవణ్‌కుమార్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం వల్ల ప్రాథమిక హక్కులు కోల్పోతామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైనా నేషనల్ హెల్త్ మిషన్ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్‌లకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శోభారాణి, రేణుక, అనురాధ, కంది కవిత, నిర్మల, సునిత పాల్గొన్నారు.



సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశా కార్యకర్తలు

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బేగంపేట్ పిహెచ్‌సీలో జిల్లా ఆశ వర్కర్స్ గౌరవ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో మండల ఆశవర్కర్లు మెడికల్ అధికారికి సమ్మె నోటీసును అందజేశారు. స్వప్న, సుమలత, శారద, స్వప్న పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెకు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు జిల్లా గౌరవ అధ్యక్షురాలు మాట్లాడుతూ సమ్మెలో జిల్లాలోని ఆశా వర్కర్‌లు పాల్గొని విజమవంతం చేసేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. చట్టాల సవరణను నిలిపివేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు రమా దేవి, అమృత, శ్యామల, రాజేశ్వరి, గౌతమి, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

కాల్వశ్రీరాంపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని ఏడీఏ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు ఇబ్బంది పడతార న్నారు. రోజు ఉదయం 5 నుంచి 11గంటల వరకు కాంటాలు వేసి సాయంత్రం హమాలీలు సహకరిస్తే త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు తరలిస్తారని, దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికారన్నారు. కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. ఏఈవో ఈశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ రామును వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ సన్మానించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏఎంసీ డైరెక్టర్లు ఎనగంటి రవి, ధ్యాగేటి రామచంద్రం తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగులకు వారాంతపు సెలవులు

కోల్‌సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు ఓవర్ టైమ్ చెల్లించడానికి, వారాంతపు సెలవులు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు మంగళవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్(సెంట్రల్) సమక్షంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యానికి, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మిక సంఘ్(సీఐటీయూ)కు మధ్య ఒప్పందం కుదిరిందని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ భిక్షపతి పేర్కొన్నారు. రెండు మూడు నెలలుగా ఏసీఎల్ చొరవతో చర్చలు జరిగాయని, ఈ మేరకు యూనియన్, యాజమాన్యంకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగిందన్నారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి ఓవర్ టైమ్ చెల్లించడానికి, వారాంతపు సెలవులు ఇవ్వడానికి అంగీకరించారన్నారు. యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో వర్క్స్ కమిటీ, సేఫ్టీ కమిటీలను వేయడానికి అంగీకరించి అమలు పరిచారన్నారు. ఈ చర్చల్లో ఏఎల్‌సీ మహ్మద్ యూసఫ్, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మిక సంఘం నుంచి శివ ప్రకాష్, ప్రజాపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, ప్రధానకార్యదర్శి అభిషేక్ సింగ్, కోశాధికారి అనిర్బాన్ చక్రవర్తి, యాజమాన్యం తరఫున మేనే జర్(హెచ్ఆర్) మయాంక్ ధావన్, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని తీసుకుంటున్న కార్మికులు

లోడింగ్ కార్మికులకు వేతన ఒప్పందం

ఆర్‌ఎఫ్‌సీఎల్ లోడింగ్, అన్‌లోడింగ్, బ్యాగింగ్, స్టిచ్చింగ్ కార్మికులకు కొత్త వేతన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం వేతన పెంపు, పీఎఫ్ విషయంలో జరిగిన పొరపాట్లను సరిచేందుకు వీలు కలిగింది. గతంలో 17నెలల కాలానికి బ్యాగుకు 7పైసలు పెంచగా ఈ ఒప్పందంలో 27నెలల కాల పరిమితిపై బ్యాగుకు 8పైసలు పెంచారు. ఇప్పటికి అమలవుతున్న ఒప్పందం ప్రకారం బ్యాగుకు 43పైసలు చెల్లిస్తుండగా ఇప్పుడు 51పైసలు చెల్లించనున్నారు. గత ఏడాది నవంబర్ 16 నుంచి కొత్త ఒప్పందం అమలు కావాల్సి ఉండగా ఐదున్నర నెలల జాప్యం తరువాత కొత్త ఒప్పందం కుదిరింది. ఏప్రిల్ 1వ తేది నుంచి ఈ ఒప్పందం అమలులోకి రానున్నది. సరాసరి ఒక్కో కార్మికుడికి నెలకు రూ.3వేలకుపైగా వేతనం పెరుగనున్నది. పీఎఫ్ ఎంప్లాయి, ఎంప్లాయర్ చెల్లించే విధంగా అంగీకారం తెలిపారు. ఒకే రోజు పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు ఒప్పందాలు కుదిరాయి.

చలివేంద్రం ప్రారంభం

ధర్మారం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతబస్టాండ్‌లో దరూల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వారసంతకు వచ్చే ప్రజల దాహార్తిని దృష్టిలో పెట్టుకొని ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. దారూల్ ఖైర్ ఉమ్మడి కరీంనగర్ చైర్మన్ డాక్టర్ ఖద్దూస్, సభ్యులు రిజ్వాన్, షకీల్, అహ్మద్, ఎండీ గౌస్ బాబా, తుమ్మల రాంబాబు పాల్గొన్నారు.

ఆమె కళ్లు సజీవం

కోల్‌సిటీ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శివాజీనగర్‌లో నివాసముంటున్న బొద్దుల రాయమల్లమ్మ(70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతురాలి నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్‌నాయక్ సహకారంతో మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి అభినందించారు.

విద్యాసంస్థకు జాతీయస్థాయి అవార్డు



జాతీయస్థాయి అవార్డు అందుకున్న కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్

కోల్‌సిటీ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఎక్స్‌లెన్స్ సౌజన్యంతో ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన జాతీయ స్థాయి లీడ్ శిక్షా అవార్డు ప్రదానోత్సవంలో గోదావరిఖనికి చెందిన కృష్ణవేణి విద్యాసంస్థ జాతీయస్థాయి అవార్డును సాధించింది. లీడ్ ఫౌండర్, సీఈఓ సుమిత్ చేతులమీదుగా కృష్ణవేణి పాఠశాలల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో హరితహారం

జ్యోతినగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ప్రాజెక్టు యాష్ పాండ్ సమీపంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రామగుండం ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఏకే త్రిపాఠి, ముకుల్ రాయ్, కే సీ సింహరాయ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను స్వాగతిస్తున్నాం


గోదావరిఖని, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణనను స్వాగతిస్తున్నామని ఎస్‌సీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూషిపాక సంతోష్ మహారాజ్ అన్నారు. మంగళవారం ఎన్‌టీపీసీ జ్యోతి భవన్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులసర్వేలు పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. వెంకటరమణ, నరహరి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణికి ఏఐటీయూసీ సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్, పీఎంఐఆర్) కవితా నాయుడుకు మంగళవారం నోటీసు అందజేసినట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నిచ్చాయని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమ్మె నోటీసును అందజేశామని, సింగరేణిలో పని చేస్తున్న కార్మిక వర్గం సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సింగరేణిలో ప్రతిపాదిత బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని, సింగరేణి ప్రైవేటీకరణ చేయరాదని, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, అలవెన్సులపై ఆదాయపు పన్నును కోల్ ఇండియా మాదిరిగా చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని, అన్ని వర్గాల కార్మికులకు రూ.9వేల కనీస పెన్షన్ అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, కే సారయ్య, కందికట్ల వీరభద్రం, ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, నాయకులు రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి పాల్గొన్నారు.



వికాస్‌కుమార్ కుటుంబానికి నష్ట పరిహారానికి అంగీకారం

గోదావరిఖని, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే ఓసీపీ-5లో సోమవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుడు వికాస్‌కుమార్ కుటుంబానికి రూ.82లక్షల వరకు నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూని యన్ (ఏఐటీయూసీ) ఆర్‌జీ-1 బ్రాంచి ఉపాధ్యక్షుడు మాదన మహేష్, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఏఐటీయూసీ ఆర్‌జీ-1 అధ్యక్షుడు ఎంఎ గౌస్‌లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వరకు సింగరేణి యాజమాన్యం సమక్షంలో యూనియన్ నాయకులకు, ఓసీపీ-5 వీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో పీసీ పటేల్ కంపెనీ రూ.42లక్షలు, ఇన్సూరెన్స్ కింద సింగరేణి యాజమాన్యం 30లక్షల నుంచి 40లక్షల వరకు నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని అంగీకారం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన తర్వాత వికాస్‌కుమార్ కుటుంబానికి అప్పజెప్పారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న కార్మిక నాయకులు, అధికారులు

సమ్మెను విజయవంతం చేయండి

అంతర్గాం, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం రామాచారి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి వద్ద గల హెచ్‌పీసీఎల్, ఐఓసీ డిపోలు, పెట్రోల్ పంప్ యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చిన రామాచారి ఈ మేరకు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు భిక్షపతి, లక్ష్మారెడ్డి, తుంగపిండి మల్లేష్, తిరుపతి పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలుశిక్ష

పెద్దపల్లిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014లో దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తికి మంగళవారం జిల్లా జడ్జి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్ పై రెండు దొంగతనాల్లో కేసు నమోదైంది. వాదోపవాదాలు విన్న జడ్జి 10 నెలల నాలుగు రోజుల శిక్షతో పాటు నాలుగు వేల రూపాయల జరిమానా విధించింది. ఈ కేసులో కోర్టు పీసీ మహేందర్‌రావు సాక్షాదారాలు ప్రవేశ పెట్టి శిక్ష పడేల చేసనందుకు అభినందించారు.